సాక్షి
నిర్మల్

సోమవారం । 5 । జూన్ । 2023


విజయ చిహ్నం చూపుతున్న సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

సభకు హాజరైన జనం

అటు వానజల్లు.. ఇటు వరాల జల్లు

- కేసీఆర్ నిర్మల్ సభ సక్సెస్
- తడిసినా.. మురిసిన జిల్లా
- పలు డిమాండ్లు చెప్పిన మంత్రి 'అల్లోల'
- సానుకూలంగా స్పందించిన కేసీఆర్

నిర్మల్: ఓవైపు వాతావరణం చల్లబరుస్తూ వరుణుడి వాన.. మరోవైపు కేసీఆర్ కరుణతో కురిపించిన వరాల వాన.. ఈరెండింటితో ఆదివారం సాయంత్రం నిర్మల్ జిల్లా ఆనందంలో తడిసిముద్దయ్యింది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వచ్చి, సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్ అనంతరం బహిరంగసభలో జిల్లాకు వరాలిచ్చారు. జిల్లా వాసుల తరఫున రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అడిగినవాటికీ సీఎం సానుకూలంగా స్పందించి, అందరినీ ఆనందింపజేశారు.

అల్లోల అడుగగా..

కలెక్టరేట్ ప్రారంభోత్సవం తర్వాత క్రషర్‌గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో ముందుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి సహకారంతో జిల్లా అన్నిరంగాల్లో దూసుకుపోతోందన్నారు. మరికొన్ని పనులనూ పూర్తిచేసేలా చూడాలని కోరారు.

- స్వర్ణప్రాజెక్టు కాలువ లైనింగ్ పనులు పూర్తిచేయించాలి.
- ఇంజినీరింగ్ కాలేజీని మంజూరుచేయాలి.
- కాళేశ్వరం ప్యాకేజీ పనులు పూర్తిచేయాలి.
- గుండెగాం ముంపు గ్రామసమస్యను తీర్చాలి.
- అర్లి బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలి.
- మూడు నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, వంతెనలు పూర్తిచేయాలి.

ఆయా సమస్యలను చూడాలంటూ మంత్రి కోరగా, వాటన్నింటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 27, 28 ప్యాకేజీ పనులు త్వరలోనే పూర్తిచేసి, లక్ష ఎకరాలకు నీరందిస్తామన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఈ ప్యాకేజీలకు నీరందిస్తామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేస్తామన్నారు. అలాగే తాలుకాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలు ప్రారంభించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

అభివృద్ధి దిశలో..

ఒకప్పుడు మారుమూల జిల్లా, అడవుల జిల్లా అని పేరున్న ఉమ్మడి ఆదిలాబాద్ ఇప్పుడు అభివృద్ధి దిశలో దూసుకుపోతోందని సీఎం కేసీఆర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు జిల్లాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. దీంతో పరిపాలన ప్రజలకు దగ్గరైందన్నారు. ఆసిఫాబాద్ లాంటి అటవీప్రాంతంలో కూడా మెడికల్ కాలేజీ వచ్చిందని పేర్కొన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమంపై దృష్టిపెట్టామన్నారు. పేదల కోసం నిర్మించే 2 వేల డబుల్ బెడ్రూం ఇళ్లకు శంకుస్థాపన చేశామన్నారు. మావనాటే, మావరాజ్ స్ఫూర్తితో గిరిజన తండాలు, గూడేలను పంచాయతీలుగా చేశామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధితో మరింత ముందుకు పోదామని సీఎం పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభం..

నిర్మల్ చేరుకున్న సీఎం కేసీఆర్ నేరుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ మంత్రి కుటుంబసభ్యులు సీఎంకు మంగళహారతులతో స్వాగతం పలికారు. మంత్రి అల్లోల తన కుటుంబసభ్యులను సీఎం పరిచయం చేశారు. అక్కడి నుంచి నేరుగా కొండాపూర్ బైపాస్‌లోని బీఆర్‌ఎస్ భవన్‌కు వెళ్లారు. పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని తన చాంబర్‌లోని చైర్‌లో కూర్చోబెట్టారు. భవన నిర్మాణంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

సభలో ప్రత్యేకంగా..

సీఎం కేసీఆర్ పాల్గొన్న బహిరంగసభలో పలు అంశాలు ఆకట్టుకున్నాయి. ప్రధానంగా పార్టీకి దూరంగా ఉంటున్న పలువురు నేతలు సభకు రావడం, వేదికపైకి రావడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల సైలెంట్‌గా, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, సీనియర్ నేతలు చిక్యాల హరీశ్‌రావు, వడ్డి రాజేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. వేదికపై ఉన్న నేతలందరూ వారిని పలకరించారు.

మనసీళ్లు వాడుకుంటున్నారని..

సరిహద్దునే ఉండే మహారాష్ట్ర గ్రామాల ప్రజలు జిల్లాలో భూములు కొనుగోలు చేస్తున్నారని, ఇక్కడ బోర్లు వేసుకుని నీళ్లను మహారాష్ట్రలో పారించుకుంటున్నారని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చెప్పారని.. సీఎం కేసీఆర్ సభలో పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, దేశమంతా మనల్ని మోడల్‌గా తీసుకుంటున్నారనే క్రమంలో సీఎం ఈ విషయాన్ని గుర్తుచేశారు. బహిరంగ సభలో తెలంగాణ ధూంధాం కళాకారులు ప్రత్యేకంగా నిలిచారు. సీఎం కేసీఆర్ రాక ముందు వరుణుడు ముంచుకువచ్చాడు. దాదాపు అరగంటపాటు వర్షం కురిసింది. అయినా సభికులు వెళ్లిపోకుండా ఉండేలా 'వానమ్మా.. కాసేపు ఆగిరావమ్మా..' అంటూ ఆకట్టుకునే పాటలు పాడుతూ అందరినీ అక్కడే ఉండేలా చేశారు.


సభా వేదికపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామన్న, విఠల్‌రెడ్డి, చిన్నయ్య


నూతన కలెక్టరేట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్

ఉమ్మడి జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ

- మరో శుభవార్త చెప్పిన కేసీఆర్
- 'సాక్షి' కథనం.. మంత్రి కోరిక మేరకు ప్రకటన

నిర్మల్: నిర్మల్ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాకు మరో శుభవార్త చెప్పారు. 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనంతోపాటు, జిల్లా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విన్నపం మేరకు ఉమ్మడి జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో 'ఇంజినీరింగ్.. ఇవ్వండి సారూ.. శీర్షికన 'సాక్షి'లో ఆదివారం కథనం ఇచ్చాం. అలాగే బహిరంగసభలో మాట్లాడుతూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ జిల్లాకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేయాలని సీఎంను కోరారు. ఈమేరకు సానుకూలంగా స్పందించిన సీఎం ఉమ్మడి జిల్లాకు ఒక జేఎన్‌టీ యూ ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది ఎక్కడ ఉంటుందని మంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. దీంతో జిల్లాలోనే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'ఇంజినీరింగ్' ఇవ్వండి సారూ..





'సమీకృతం' ప్రారంభించి..

జిల్లాకు గుండెకాయలాంటి సమీకృత కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ అట్టహాసంగా ప్రారంభించారు. కలెక్టర్‌ను చాంబర్‌లో కూర్చోబెట్టారు. అనంతరం సీఎం కేసీఆర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పవర్ పర్ క్యాపిటల్‌లో నంబర్‌వన్‌లో ఉన్నామన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ముత్రా(కే) జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు తీసుకుని మనకు గౌరవం తెచ్చిపెట్టిందని గుర్తుచేశారు. దళిత, గిరిజనులు, వెనుకబడి తరగతుల్లో నిరుపేదలు ఉన్నారని, వారికోసం చేయాల్సింది చాలా ఉందని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల తర్వాత ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. పోడు భూముల పంపిణీని బ్రహ్మాండంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. దేశమంతా మన పథకాలను చూసి తెలంగాణ మోడల్ కావాలని కోరుతున్నారని, అందుకు మీరే కారణం అని సీఎం కేసీఆర్ ఉద్యోగులను అభినందించారు. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు. అంతకుముందు కొత్త కలెక్టరేట్‌లోకి సీఎం, మంత్రులకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలోనే మైనార్టీ రెసిడెన్షియల్, మెడికల్ కాలేజీ భవనం, బంజారభవన్, పలురోడ్లు, డబుల్‌బెడ్రూం ఇళ్లకు సంబంధించిన పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ దంపతుల పూజలు


పూజలు చేస్తున్న కలెక్టర్ దంపతులు

నిర్మల్‌చైన్‌గేట్: నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా అధికారుల భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో ఆదివారం కలెక్టర్ దంపతులు వరుణ్‌రెడ్డి, కుమురంభీం అదనపు కలెక్టర్ చాహత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు కలెక్టర్ దంపతులతో శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి


హర్యాన గవర్నర్ దత్తాత్రేయతో నాయకులు


నిర్మల్ ఖిల్లా: గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లావాసి, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో 'అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత' అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఎంఎస్ జాతీయ నాయకుడు బీ సురేంద్రన్ పాల్గొన్న ఈ సభలో తెలంగాణ రాష్ట్ర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ ఉమన్నగారి దేవేందర్‌రెడ్డితో ఈ అంశంపై చర్చించారు. గల్ఫ్ కార్మిక నాయకులు తోట ధర్మేందర్, స్వదేశ్ పరికిపండ్ల మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు.

హామీల అమలులో విఫలం


మాట్లాడుతున్న వినోద్‌నాయక్

ఖానాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారం సదర్మాట్ రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తామని గత ఎన్నికల్లో ఇక్కడ జరిగిన సభలో ప్రకటించిన సీఎం ఇంతవరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఖానాపూర్ తర్వాత జరిగిన సభల్లో డివిజన్ చేస్తామని ప్రకటించినా పలుచోట్ల డివిజన్లు ఏర్పాటు చేశారని, గిరిజన నియోజకవర్గమైన ఖానాపూర్‌పై ఎందుకు వివక్ష చూపుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్ నియంత పాలనతో ప్రజలు విసిగిపోతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు నేత శ్యాం, మీర్జాబేగ్, అలిశెట్టి నాగరాజు, షారు ఖాన్, నారాయణ, శ్రీను, సలీం తదితరులున్నారు.

'రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన'


ఏలేటిని హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. ముఖ్య నాయకులందరినీ శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణలకు భయపడే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ బలగాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ ఆహ్వానం పలకగా, ఎస్పీ హౌస్ అరెస్ట్ చేయాలని ఆదేశించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. బీజేపీ నాయకులను భేషరతుగా విడుదల చేయాలన్నారు.

ఎక్కడికక్కడే అరెస్టులు

సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ ప్రారంభోత్సవానికి ఆదివారం సీఎం కేసీఆర్ వచ్చినందున ముందస్తుగా జిల్లాలో వివిధ పార్టీలు, విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశి, విభాగ్ ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, దినేశ్ తదితరులున్నారు.

రుణం మాఫీ కాలే..!

- అన్నదాతకు తప్పని ఎదురుచూపు
- రెన్యూవల్ చేసుకోకుండా నిరీక్షణ
- బకాయిదారులుగా బ్యాంకుల ముద్ర
- రైతుల వ్యక్తిగత ఖాతాల ఫ్రీజింగ్
- ఆందోళనలో జిల్లా రైతాంగం
- జిల్లాలో 1.17 లక్షల మంది అర్హులు



నిర్మల్‌చైన్‌గేట్: పంట రుణాలు మాఫీ కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. 2020లో తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియ రూపొందించినప్పటికీ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. రూ.లక్ష లోపు పంట రుణాలను నాలుగు విడతల్లో నాలుగేళ్లలోగా మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినా.. ఆచరణలో అమలుకు నోచుకోలేదు. దీంతో రైతులకు కొత్త రుణాలు అందడం లేదు. ఎప్పటిలాగే పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

రుణమాఫీ కాదేమోనని..

పంట రుణమాఫీకి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అప్పులు రెన్యూవల్ చేసుకుంటే మాఫీ వర్తించదేమోననే భయంతో చాలామంది రైతులు బ్యాంకుల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా బ్యాంకులకు రుణభారం అలాగే ఉండిపోగా రైతులను బకాయిదారులుగా గుర్తిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ పనులు ఊపందుకోనున్నాయి. ఇప్పటికే రైతులు పొలాల్లో నల్లమట్టిని పోయించడం, పశువుల పేడ తరలించడం లాంటి పనులు చేస్తున్నారు. కొందరు సోయా, మొక్కజొన్న, వరి విత్తనాలను సేకరించే పనిలో ఉన్నారు. సాగు కోసం రుణమాఫీ ప్రకటించక ముందు పంటలపై వచ్చిన ఆదాయంతో రైతులు రుణాలు చెల్లించేవారు. సీజన్ ఆరంభానికి ముందు మళ్లీ బ్యాంకుల నుంచి అప్పు పొందేవారు.

నాలుగు దశల్లో..

రాష్ట్ర వ్యాప్తంగా 2018 డిసెంబర్ 11 నాటికి ఉన్న పంట రుణాల బకాయిలను రూ.లక్షలోపు వరకు మాఫీ చేస్తామని 2020 మార్చిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఇప్పటికీ రూ.25వేలలోపు మాత్రమే రుణమాఫీ చేశారు. మిగతా రైతులు మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. మొదటి విడతగా రూ.25 వేలలోపు రుణం తీసుకున్న రైతులందరికీ ఒకేసారి తొలిదశలో చెల్లించేందుకు నిర్ణయించగా, ఆ తర్వాత రూ.50వేలు, ఆపై రూ.75వేల వరకు ఉన్న రుణాలు, చివరన రూ.లక్ష వరకు ఉన్న రుణాలను నాలుగు దశల్లో మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. రూ.50 వేలలోపు రుణం తీసుకున్న రైతులకు సంబంధించిన రుణాలను 2021 ఆగస్టు 16 నుంచి 31వ తేదీలోపు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

జిల్లాలో 1.17 లక్షల మంది అర్హులు

జిల్లాలో 1.65 లక్షల మంది రైతుల్లో పంట రుణాల మాఫీకి 1.17 లక్షల మంది అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు రూ. 25వేలలోపు బకాయి ఉన్న 7,102 మందికి రుణమాఫీ కాగా, రూ.50వేల లోపు రుణ బకాయి ఉన్న 60,898 మందికి, రూ.50 వేల పైన రుణ బకాయి ఉన్నవారు 49వేల మందికి రుణాలు మాఫీ కాలేదు. పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో పెట్టుబడుల కోసం వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో పంట రుణం మాఫీని పూర్తిగా అమలు చేస్తే ఊరట లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లేకపోతే, ఎప్పటిలాగే పెట్టుబడి కోసం అధిక వడ్డీ చెల్లించి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

జిల్లాలోని రైతులు, రుణ వివరాలు

జిల్లాలోని రైతులు	1.65 లక్షలు
రుణమాఫీకి అర్హులు	1.17 లక్షలు
రూ.25వేల లోపువారు	7,102
రూ.50వేల లోపువారు	60,898
రూ.50వేల పైబడినవారు	49,000

రైతుల బాధలు అర్థం చేసుకోవాలి



ప్రభుత్వం మా రైతుల బాధలు అర్థం చేసుకోవాలి. పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. రుణమాఫీ చేస్తే ఎంతో ఊరట లభిస్తుంది. – సాయన్న, కుంటాల

ఆశగా ఎదురుచూస్తున్నం



పంట రుణాల మాఫీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నం. నాకు రూ. 75వేల పైన రుణం ఉంది. ఇప్పటికీ వడ్డీలు కట్టలేక ఇబ్బందిపడుతున్న. ప్రభుత్వ హామీ ప్రకారం రుణాలు మాఫీ చేసి న్యాయం చేయాలి. – పుప్పాల రవి, పెంబి

కేసీఆర్ సభ విజయవంతంపై మంత్రి కృతజ్ఞతలు


నిర్మల్: జిల్లాకేంద్రంలో ఆదివారం నాటి సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతమైందని, ఇందుకు కృషిచేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం రాత్రి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్, బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభంతో పాటు బహిరంగసభను వర్షంలోనూ విజయవంతం చేయడం విశేషమన్నారు. ఇందుకు కృషిచేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

తరలివచ్చిన ఉమ్మడిజిల్లా..

నాలుగేళ్ల తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సీఎం కేసీఆర్ రావడంతో నాలుగు జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, నేతలు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిర్మల్ తరలివచ్చారు. మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఎమ్మెల్సీ దండే విఠల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, విఠల్‌రెడ్డి, రేఖానాయక్, రాథోడ్ బాపురావు, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్స్ కొరిపల్లి విజయలక్ష్మి, కోవ లక్ష్మి, జనార్దన్‌రాథోడ్, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమ భరత్, ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ చిప్పన లింగయ్య, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో పోలీసుల పాత్ర

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్ టౌన్: జిల్లా అభివృద్ధిలో పోలీసుల పాత్ర కూడా ఉందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఏర్పాటుచేసిన భారీ వాహనాల ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమై న్యూబస్టాండ్ రోడ్, బుధవార్‌పేట్, గాంధీచౌక్, పాత మార్కెట్, మంచిర్యాల చౌరస్తా మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో పోలీస్ కార్యాలయం, ఎస్పీ క్యాంప్ ఆఫీస్, పోలీస్ క్వార్టర్స్ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, టోల్ ఫ్రీ నంబర్ 1930 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ మల్లేశ్, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐలు రాజశేఖర్, దేవేందర్, పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాయకుల ముందస్తు అరెస్టులు

కడెం: జిల్లా కేంద్రంలో ఆదివారం సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ నాయకులను పోలీసులు శనివారం రాత్రి ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాన్ని అపలేరని, ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల ఏర్పాటు, పోడు భూములకు పట్టాలు ఎన్నో హామీలను నెరవేర్చలేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సునారికారి రాజేశ్ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్, రవీందర్‌గౌడ్, రాజేందర్, భాస్కర్, కాంగ్రెస్ నాయకులు మల్లేశ్, వెంకటేశ్ ఉన్నారు.

ఆదుకుంటున్నారు..



ఆర్థికసాయం అందిస్తున్న యువకులు

సాక్షి స్పందన

బోథ్: మండలంలోని గుర్రాలతాండలో దీన పరిస్థితుల్లో ఉన్న మల్హారి సింగ్ కుటుంబంపై 'సాక్షి'లో ఈ నెల 3న ప్రచురితమైన 'ఇంటికి పెద్ద దిక్కు..ఆ చిన్నారి' అనే కథనానికి స్పందన లభిస్తోంది. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కొండపర్తి ప్రశాంత్, దర్శనం సంజయ్ నిత్యావసర సరుకులతో పాటు రూ.7 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు. తమ స్నేహితులతో కలిసి వీలైతే ఇంటి నిర్మాణానికి తమవంతు సహాయం చేస్తామని సొనాల గ్రామానికి చెందిన ఇర్ల అఖిల్ పేర్కొన్నారు. ఫోన్‌పే రూపంలో పలువురు దాతలు నగదు అందిస్తున్నారు. కార్యక్రమంలో చంద్రమోహన్, చౌహాన్ విశాల్, ఇర్ల అఖిల్, హరీష్, శ్రీకాంత్, చౌహాన్ వినోద్, కైలాస్, సోలంకి సాయి, ఉదయ్, నవీన్, సుక్వీర్, గణేశ్ పాల్గొన్నారు.

మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని అసెంబ్లీలో ప్రస్తావన తేవడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. తీర్మానాన్ని వెంటనే ఆమోదించేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ద్వారా కేంద్రాన్ని ఒప్పించాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌ను ఉట్నూర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సాంబన్న షిండే, గంగారాం షిండే, వాడగురే విజయ్, నారాయణ, తులసీరామ్, నందు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసారూరల్(ముధోల్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చుచుంద్‌లో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చంద్రకాంత్ (36) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో అప్పులు పెరిగిపోవడంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విప్లవమయం సుదర్శన్ జీవితం

- అజ్ఞాతంలోనే ఐదు దశాబ్దాలు
- దౌర్జన్యాలను ఎదురించి ప్రజలకు చేరువై..



సుదర్శన్ చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు

బెల్లంపల్లి: నల్ల బంగారు నేల బెల్లంపల్లిలో వికసించిన ఎర్ర మందారం సుదర్శన్. నూనూగు మీసాల 22ఏళ్ల నవ యవ్వనంలో విప్లవ సిద్ధాంతాలకు ఆకర్శితుడై సుమారు ఐదు దశాబ్దాలు అజ్ఞాతం వాసం గడిపి 70ఏళ్ల వయస్సులో తుది శ్వాస విడిచాడు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడైన ఆయన జీవితాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసి ఏనాడూ ఇంటిముఖం చూడలేదు. నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం, పీడిత జన విముక్తి కోసం పోరాడుతూనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో మే 31న తీవ్ర అనారోగ్య సమస్యలతో కన్నుమూశాడు. పీడిత తాడిత ప్రజలు ఆప్యాయంగా దూలా దాదా అని పిలుచుకునేవారు.

ఆరుగురు సంతానంలో అందరి కన్న పెద్ద

సింగరేణి కార్మికుడు కటకం మల్లయ్య, వెంకటమ్మ దంపతులకు ఆరు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు సుదర్శన్. ఆయనకు ఐదుగురు తోబుట్టువులు రఘు, కమలాకర్, సతీష్‌కుమార్, పద్మ, విజయ ఉన్నారు. తండ్రి మల్లయ్య రిటైర్మెంటు అయ్యాక 2017లో, తల్లి వెంకటమ్మ 2018లో మృతిచెందారు. తల్లిదండ్రులు మరణించినా ఇంటి వైపు రాకుండా సుదర్శన్ విప్లవ పంథాను అనుసరించాడు. సుదర్శన్‌ను ప్రభుత్వానికి లొంగిపొమ్మని పోలీసులు కోరిన ప్రతీసారి తండ్రి మల్లయ్య ససేమిరా అనేవాడు. నిక్కచ్చిగా వ్యతిరేకించేవాడు.

తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో సుదర్శన్‌పై రూ.కోటికిపైగా రివార్డు ఉంది.

డిగ్రీ చదివి.. డిప్లొమా చేసి

ప్రాథమికోన్నత విద్యను బెల్లంపల్లిలో పూర్తి చేసిన సుదర్శన్ డిగ్రీ బీఎస్సీని మంచిర్యాలలో అభ్యసించాడు. ఆ తర్వాత మైనింగ్ డిప్లొమా చేయడానికి హైదరాబాద్ వెళ్లాడు. 1967లో జరిగిన నక్సల్‌బరి, శ్రీకాకుళ పోరాటాల ప్రభావంతో క్రమంగా రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు ప్రభావితం అయ్యాడు. యూనియన్‌లో క్రియాశీలకంగా పని చేశాడు. 1974–75 కాలం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. విద్యార్థి దశలో అన్యాయాలు, దౌర్జన్యాలను సహించేవాడు కాదు. బెల్లంపల్లిలో గూండాల ఆగడాలను అరికట్టడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఆర్ఎస్‌యూలో పని చేస్తూనే కార్మిక వర్గ పోరాటాలకు ఆజ్యం పోశాడు. పెద్ది శంకర్, గజ్జల గంగారాం, నల్లా ఆదిరెడ్డి, బండెల రాములు, పులి మధునయ్యలతో కలిసి సింగరేణి కార్మికవర్గ సమస్యలు, ఆదివాసీ, గిరిజనులపై అటవీ అధికారులు, పోలీసులు, దొరలు, భూస్వాములు సాగిస్తున్న దాష్టీకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో క్రియాశీలంగా పని చేశాడు.

గూండాల హత్య అనంతరం అజ్ఞాతంలోకి..

ఆ రోజుల్లో బెల్లంపల్లిలో ఏ బస్తీలో చూసినా గూండాల ఆధిపత్యం కొనసాగేది. కార్మికులపై దాడులు, కల్లు దుకాణాల్లో దౌర్జన్యాలు, కార్మికులను బెదిరించి కల్లు సీసాలు కొనుగోలు చేయించి గూండాలు తాగేవారు. గూండాలకు కుందేళ్ల శంకర్, దస్తగిరి నాయకత్వం వహించి ప్రజల్లో తీవ్ర భయాందోళన కలిగించేవారు. ఇళ్లలో చొరబడి మహిళలను చెరిచేవారు. ఆర్ఎస్‌యూలో పని చేస్తున్న సుదర్శన్, బండెల రాములు, మధునయ్య తదితర విప్లవ శ్రేణులు 1978 మార్చి 27న పట్టపగలు కన్నాల బస్తీలో వారిని పట్టపగలు హత్య చేసి ప్రజలకు చేరువయ్యారు. అదే ఏడాది బెల్లంపల్లిలో పని చేస్తున్న సింగరేణి పర్సనల్ అధికారి శ్యామ్‌మోహన్‌రావు కొడుకు రఘు ఇంటి పనిమనిషిపై అత్యాచారం చేసి చంపేశాడు. అతడిని కఠినంగా శిక్షించాలని నిర్వహించిన ఆందోళనలో సుదర్శన్ పాల్గొన్నాడు. ఈ ఆందోళన లాఠీచార్జికి దారితీసింది. ఈ రెండు ఘటనల అనంతరం సుదర్శన్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. అంతకుముందు రామకృష్ణాపూర్ ఏరియా ఆర్‌కే–1లో కార్మికుడిగా కొంత కాలం పని చేశాడు.

రైతు పోరాటాలకు నాయకత్వం

ఆర్ఎస్‌యూ నుంచి పీపుల్స్‌వార్‌లో చేరిన తర్వాత సుదర్శన్ జన్నారం, నిర్మల్, లక్సెట్టిపేట ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగించాడు. జిల్లా కమిటీ సభ్యుడి హోదాలో పని చేశాడు. ఆ ప్రాంత రైతుల్లో చైతన్యం రగిల్చి భూపోరాటాలు చేశాడు. పీపుల్స్‌వార్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా 1981 ఏప్రిల్ 19న ఇంద్రవెల్లిలో జరిగిన సభకు నాయకత్వం వహించాడు. 1985లో మహారాష్ట్రలోని గడ్చిరోలి, సిరోంచ ప్రాంతాలకు వెళ్లాడు. ఫారెస్టు లైజన్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1995లో స్పెషల్ కమిటీ కార్యదర్శిగా నియామకం అయ్యాడు. 2001లో కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా పదోన్నతి పొందాడు.

ఉద్యమంలో అసువులు బాసిన భార్యాభర్తలు



సుదర్శన్, లలితక్క(ఫైల్)

పీపుల్స్‌వార్‌లో చేరిన సుదర్శన్, లలితక్క భార్యాభర్తలుగా ఉద్యమంలో పని చేశారు. విప్లవ మార్గాన్ని ఎంచుకున్న లలితక్కను పెళ్లి చేసుకున్న సుదర్శన్ దండకారణ్యంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న సమయంలో 2003 మే 13న బెజ్జూర్ మండలం అగర్‌గూడ అటవీ ప్రాంతంలో జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో లలితక్క మృతిచెందింది.

సుదర్శన్‌కు కన్నీటి జోహార్లు

బెల్లంపల్లి: మావోయిస్టుపార్టీ ఉద్యమంలో పనిచేసి కన్నుమూసిన కేంద్రకమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్‌కు బెల్లంపల్లిలో కుటుంబ సభ్యులు, రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల శ్రేణులు ఆదివారం కన్నీటి జోహార్లు అర్పించారు. బెల్లంపల్లి కన్నాల బస్తీలోని సుదర్శన్ సోదరుడు కటకం సతీశ్‌కుమార్ ఇంటికి సుదర్శన్ చిన్ననాటి మిత్రులు, మాజీ నక్సలైట్లు, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. సుదర్శన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమర్‌రహే కామ్రేడ్ సుదర్శన్ అని నినదించారు. సురదర్శన్ పోరాట పటిమ, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు కె.సురేఖ, విశ్వప్రసాద్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, రొడ్డ శారద, నాతరి స్వామి, బండి ప్రభాకర్, కేవీ ప్రతాప్, శ్రీధర్, జగన్, సీపీఐ నాయకులు చిప్పనర్సయ్య, చంద్రశేఖర్, ఐలయ్య, రాజం, బీజేపీ నాయకుడు ఏమాజీ, సీఐడీ రిటైర్డు అడిషనల్ ఎస్పీ పులియాల రవికుమార్, శ్రీమన్నారాయణ, ఆడెపు సమ్మయ్య, ఎం.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేల్కొనకపోతే.. తప్పదు భారీ మూల్యం



పంచభూతాల సమాహారమే పర్యావరణం. గాలి, నింగి, నేల, నీరు, నిప్పు.. వేటికవే ప్రత్యేకం. కాలుష్యపు కాసారంలో నలుగుతున్న పంచభూతాలు. పీల్చే గాలి మొదలు.. ప్రతి ఒక్కటి కలుషితం అవుతున్న తరుణంలో అప్రమత్తంగా జీవించాల్సిన ఆవశ్యకతను చెబుతోంది. జీవ వైవిధ్యం కొరవడుతున్న పరిస్థితుల్లో ముప్పు తరుముకొస్తోంది. తరిగిపోని వనరులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కథనం.

- దెబ్బతింటున్న పర్యావరణం
- మానవ తప్పిదాల వల్లే కాలుష్యం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

బోథ్: మన జీవితంతో ముడిపడి ఉన్న భూమి, నీరు, గాలి మన పరిసరాలను, వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. భూమి మీద మొక్కలు నాటి పెంచితే స్వచ్ఛమైన గాలిని పీలుస్తాం. కానీ అభివృద్ధి, ఆధునికత పేరుతో భూమిని తవ్వుతున్నాం.. చెట్లు నరికేస్తున్నాం.. నీరు నిలిచేందుకు తావు లేకుండా చేస్తున్నాం. వాతావరణంలో మార్పులు ఏర్పడి భూతాపం పెరిగి పర్యావరణానికి ప్రమాదాన్ని తెస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకం, విష పూరిత రసాయనాలు, శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం పెరగటం, పరిశ్రమలు వదిలే వ్యర్థాలు పర్యావరణానికి మరింత హాని చేస్తున్నాయి. మన మనుగడకు కారణమైన ప్రకృతిని మనమే నాశనం చేసుకొని మనలను కాపాడాల్సిన ప్రకృతి కబళించే పరిస్థితిని సృష్టించుకుంటున్నాం. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడం వల్ల భూ పొరల్లోకి రసాయనాలు చేరి కాలుష్యం అవుతుంది. పట్టణాలు, నగరాల్లో వాహనాలు, ఫ్యాక్టరీల నుండి వెలువడే పొగ, చెత్తను కాల్చడం వల్ల గాలిలోకి ప్రమాదకరమైన రసాయనాలు చేరుతున్నాయి.

గ్రీన్ పీస్ ఉద్యమంతో...

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు 1970లో మొదటి ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. అణ్వాయుధాలకు వ్యతిరేకంగా గ్రీన్ పీస్ ఉద్యమం మొదలైంది. 1972లో జూన్ 5న అంతర్జాతీయ స్థాయిలో మొట్టమొదటి పర్యావరణానికి సంబంధించిన సదస్సు స్వీడన్‌లో జరిగింది. ప్రతి సంవత్సరం జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జరపాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది.

మొక్కలు నాటుదాం..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం అవశ్యం. అప్పుడే పచ్చదనం ఫరిడవిల్లుతుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో పల్లెలు కళకళలాడుతాయి. వానరాలు, ఇతర జంతువులు అడవుల్లో జీవనాన్ని సాఫీగా సాగిస్తాయి. ఈ తరుణంలో ప్రతి ఒక్కరు మొక్కల పెంపకాన్ని ఓ ఉద్యమంగా భావించాలి. ఏటా బాధ్యతగా కనీసం మూడు మొక్కలు నాటి పెంచాలి. అవసరమైతే దత్తత తీసుకోవాలి.

ప్లాస్టిక్‌ను తరిమేద్దాం..

కేంద్రం ప్రభుత్వం 75 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల (క్యారీ బ్యాగుల) విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. టాస్క్ ఫోర్సును నియమించి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టింది. పురపాలికల్లో నిషేధానికి చర్యలు తీసుకుంటున్నా, పంచాయతీల్లో వెనుకబడే ఉన్నాయి. ప్రజలే బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించుకోవాలి.

జీవవైవిధ్యం కాపాడుకోవాలి



అడవులు విస్తారంగా ఉంటేనే పర్యావరణ సమతుల్యత ఉంటుంది. సరైన సమయానికి వర్షాలు కురుస్తాయి. ఆక్సిజన్ లెవల్స్ పెరుగుతాయి. ప్లాస్టిక్ నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ప్రజలు భాగస్వాములై జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి.

– ప్రణయ్, బోథ్ అటవీ రేంజ్ అధికారి

యూనియన్ బ్యాంకులో అగ్నిప్రమాదం



కాలిపోయిన యూనియన్ బ్యాంక్ సామగ్రి



కాలిపోయిన ఫర్నీచర్



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన కంప్యూటర్లు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్ కాంప్లెక్స్‌లోని యూనియన్ బ్యాంకులో ఆదివారం తెల్లవారు జామున షాక్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ అగ్ని ప్రమాదంలో కంప్యూటర్లతో సహా కొన్ని డాక్యుమెంట్లు, ఏసీ ఇతర సామగ్రి అగ్నికి స్వల్పంగా కాలిపోయాయి. బ్యాంకులో నుంచి పొగలు రావడం గమనించిన కాంప్లెక్స్ యజమాని వెంటనే బ్యాంకు సిబ్బంది, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.15 నుంచి 20 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బ్యాంకు మేనేజర్ కవల్ జిత్ కుక్రేజ పేర్కొన్నారు. బ్యాంకులోని డబ్బు మాత్రం భద్రంగా ఉందని మేనేజర్ పేర్కొన్నారు. పట్టణంలోని మరో రెండు యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లలో బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగిస్తామని, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

భర్త, ఇద్దరు కుమారుల మృతి తట్టుకోలేక..

- ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

భైంసాటౌన్(ముధోల్): వివిధ కారణాలతో ఇంట్లో ఒకరి తరువాత ఒకరు చనిపోవడంతో కలత చెందిన దగ్డే సావిత్రబాయి (55) అనే మహిళ శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన భైంసాలోని సిద్ధార్థనగర్‌లో చోటు చేసుకుంది. సీఐ ఎల్.శ్రీను, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. రెండేళ్ల క్రితం సావిత్రబాయి భర్త సురేశ్, ఏడాది క్రితం పెద్ద కుమారుడు అనారోగ్యంతో మృతి చెందారు. దీనికితోడు 8 నెలల క్రితం చిన్న కుమారుడు స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో ఈతకు వెళ్లి నీటిలో మునిగి చనిపోయాడు. దీంతో తీవ్రంగా కలత చెందిన సావిత్రబాయి మరో కుమారుడు అజయ్, కోడలితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి కుమారుడు అజయ్ పని నిమిత్తం బయటకు వెళ్లగా కోడలితో కలిసి ఇదే కాలనీలోని తన కూతురు ఇంటికి వెళ్లింది. తనకు నిద్ర రావడం లేదంటూ కొద్దిసేపటికి అక్కడి నుంచి ఇంటికి వచ్చింది. ఆదివారం వేకువ జామున అజయ్ ఇంటికి రావడంతో ఉరేసుకుని కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లుసీఐ తెలిపారు.



సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్‌కు నిర్మల్ పెయింటింగ్ అందజేస్తున్న మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యేలు



కలెక్టర్ దంపతులకు జ్ఞాపిక ఇస్తున్న బాసర ఆలయ ఈవో

సీఎం సభ సక్సెస్..

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం సీఎం సభ సక్సెస్ అయ్యింది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. సభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి కురిపించిన వరాలవానకు సభికుల నుంచి ఫుల్‌జోష్‌తో స్పందన వచ్చింది. సభ ప్రారంభానికి ముందే ఈదురుగాలు రావడంతో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నేతల ఫ్లెక్సీలు, కటౌట్లు కిందపడి చినిగిపోయాయి. సీఎం కేసీఆర్ సభకు వచ్చే లోపు వర్షం కురవడంతో ప్రజలు అక్కడి నుంచి పరుగులు తీశారు. కొందరు వృద్ధులు పడిపోయిన కటౌట్‌ల కింద తలదాచుకున్నారు. మరికొందరు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలను తలపై పెట్టుకుని వర్షానికి తడవకుండా అక్కడే కూర్చుని నానాఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



వేదికపై పురాణం సతీష్, లోక భూమారెడ్డి, గోడం నగేశ్, రాథోడ్ బాపురావు, రేఖానాయక్



వర్షం కురుస్తుండడంతో నెత్తిపై కుర్చీలు అడ్డుగా పెట్టుకున్న ప్రజలు



వేదికపై కళాకారుల ఆటాపాట